క్లుప్తంగా

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం భూమిపూజ చేశారు. 16, 17వ వార్డుల్లో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టనున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పనులు చేసేదెవరో, ప్రగల్భాలు పలికేదెవరో ప్రజలే తేల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్ ఎస్.బాబు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరు



రోడ్డు నిర్మాణం జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం: స్థానిక పట్టణంలోని గాంధీనగర్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. మంగళవారం రోడ్డు నిర్మాణం జరిగే ప్రాంతాన్ని పరిశీలించిన ఆయనకు ప్రధాన సీసీ రోడ్డు నుంచి 600 మీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందని ఏఈ వెంకట్ తెలిపారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్ఇన్స్పెక్టర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు



హద్దురాళ్లు ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని చిత్రకోట బొడ్డవలస గ్రామం వద్ద హద్దురాళ్ల ఏర్పాటు మంగళవారం చేపట్టారు. రైతుల మధ్య తగాదాలు రాకుండా సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు ప్రక్రియలు పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల తీర్మానాలు ఇవ్వండి

బాడంగి: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారి ఇంటి వద్ద ఇంకుడుగుంతల ఏర్పాటుకు సంబంధించి, పంచాయతీ తీర్మానం చేయించి, ఇప్పించాలని ఎంపీడీఓ ఆంజనేయులను హౌసింగ్ ఏఈ ఎస్.సత్యం కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓను కలిసి, ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల జాబితా అందజేశారు. ఉపాధి హామీ పథకం టీఏలు లేదా సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్లతో ఆ తీర్మానాలు చేయించి, తమ కార్యాలయానికి అప్పగించాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 18 హౌసింగ్ లేఅవుట్లలో 142 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నట్లు తయారైన జాబితాను అందజేశారు. పంచాయతీల వారీగా తీర్మానాలు చేయించి, ఇస్తామని ఎంపీడీఓ తెలిపారు.

గ్రావెల్ తరలిస్తున్న వాహనాల సీజ్



అధికారులు సీజ్ చేసిన లారీలు

బొబ్బిలి: గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను పట్టుకుని, సీజ్ చేసినట్లు తహసీల్దార్ డోల రాజేశ్వరరావు మంగళవారం తెలిపారు. మండలంలోని కలువరాయివలస బందలో గ్రావెల్ను తవ్వుతుండగా రెండు లారీలు, ఓ ప్రొక్లెయినర్ను పట్టుకున్నామన్నారు. అర్ధరాత్రి వేళ అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారన్న స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లి, వాహనాలను పట్టుకున్నామన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ బూరాడ సెక్టార్ సూపర్వైజర్ సీహెచ్ నూకాలమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని వన్నలి, చాటాయివలస, కె.ఎం.వలస, వండానపేట గ్రామాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఆమె గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వన్నలి పాఠశాల హెచ్ఎం గౌరీశ్వరరావు, సర్పంచ్ జి. రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్తోనే సంక్షేమ పాలన

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తెర్లాం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సింగిరెడ్డివలస, సీతారాంపురం, బొంగుపేట గ్రామాల్లో మంగళవారం సాయంత్రం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గడిచిన నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పథకాల రూపంలో ప్రతీ ఇంటికి మేలు జరిగిందన్నారు. ప్రధానంగా లంచాలకు తావులేకుండా, ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని పథకాలను మన సీఎం జగనన్న అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పనితీరుతో ప్రజలు సంతోషంగా ఉన్నారా లేదా అని తెలుసుకోవడానికే మమ్మల్ని ముఖ్యమంత్రి ఇంటింటికీ పంపిస్తున్నారన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం వైఎస్సార్ సీపీ మండలాల అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, ఎంపీపీ ఎస్.ఉమాలక్ష్మి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పి.సత్యంనాయుడు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనందరి బంధువు సీఎం జగన్: ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి తన సుపరిపాలనతో అందరి బంధువుగా పేరొందారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పట్టణ పరిధిలోని కొత్తవలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధనకు ఆయన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి, ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేశారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో నాలుగేళ్లుగా ప్రజలు సుఖసంతోషాలతో మెలుగుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, నేతలు కె.సత్యనారాయణ, బి.హరి, వి.అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఓటమి భయంతోనే టీడీపీ విధ్వంసం

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: ఓటమి భయంతోనే టీడీపీ విధ్వంసానికి పాల్పడుతోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి విమర్శించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ పుంగనూరులో చోటుచేసుకున్న ఘర్షణను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. చంద్రబాబు సమక్షంలో టీడీపీ కార్యకర్తలు విధ్వంసకాండ సృష్టించి, పలువురు పోలీసులను శాశ్వతంగా అవిటి వారు అయ్యేలా గాయపరచడం దారుణమన్నారు. రాజకీయ స్వార్థం కోసమే టీడీపీ రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుండడం దుర్మార్గమైన చర్యన్నారు. ఎలాగైనా ప్రజల్లో గుర్తింపు పొందాలని బరితెగింపు చర్యలకు టీడీపీ శ్రేణులు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పుంగనూరు విధ్వంసకాండకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం



బొబ్బిలి: నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవికుమార్

వంగర: మండలంలోని రెండు పంచాయతీల సర్పంచ్లు, నాలుగు వార్డు మెంబర్ల ఎన్నికకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించినట్లు ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఫారం-1 నోటీస్ను ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఓనె అగ్రహారం, లక్ష్మీపేట పంచాయతీలకు సర్పంచ్ ఎన్నిక జరుగుతుందని, రుషింగి, కొప్పరవలస, కొట్టిశ, ఇరువాడలో ఒక్కొక్కటి చొప్పున వార్డు మెంబర్కు ఎన్నిక జరుగుతుందన్నారు. ఓనె అగ్రహారానికి సంబంధించి, వంగర జెడ్పీ ఉన్నత పాఠశాల, లక్ష్మీపేటకు సంబంధించి, ఎం.సీతారాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, కొప్పరవలస, రుషింగికి సంబంధించి, కొప్పరవలస ప్రాథమిక పాఠశాల, ఇరువాడకు సంబంధించి, ఇరువాడ ప్రాథమిక పాఠశాలలో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. ఇప్పటికే నలుగురు స్టేజ్-1 ఆర్ఓలు, ఏఆర్ఓల నియామకం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఓలు ఎల్.త్రినాథ్, టి.కన్నబాబు, ఆర్ఓ ఎ.అప్పలరాజు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని కేఆర్పురం పంచాయతీకి సంబంధించి, నాలుగో వార్డు మెంబర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైందని పంచాయతీ ఎన్నికల అధికారి సీహెచ్ భాస్కరరావు తెలిపారు. మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నామని, ఈ నెల 10వ తేదీతో నామినేషన్లకు గడువు ముగుస్తుందన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 13న అనర్హుల తొలగింపు, 14న ఉపసంహరణ, బరిలో నిలిచే అభ్యర్థుల ప్రకటన, 19న ఓటింగ్తో పాటు ఓట్ల లెక్కింపు, ఎన్నికైన అభ్యర్థి వివరాలు వెల్లడిస్తామన్నారు.

బొబ్బిలి: మండలంలోని కారాడ, శివడవలస, కొండదేవుపల్లి గ్రామాల్లో నాలుగు వార్డుల్లో వార్డు మెంబర్ల ఎన్నికకకు సంబంధించి, నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైనట్లు ఎంపీడీఓ పోతుల రవికుమార్ తెలిపారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆశ్రమ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న వైద్యులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటలో కొత్తగా నిర్మిస్తున్న అనాథ వృద్ధాశ్రమం నిర్మాణానికి దాతలు తమవంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం శ్రీకాకుళం రోడ్డులోని కృష్ణ మెడికల్ సెంటర్ ప్రారంభం సందర్భంగా రేడియాలజీ డాక్టర్ ఎ.రేణుక, డాక్టర్ సోమశేఖర్లు కలిసి రూ.లక్ష చెక్కును ఆశ్రమ నిర్వాహకులు పి.శ్రీనివాసరావుకు అందజేశారు. ఎంతో మంది వృద్ధులను చేరదీసి, వారికి సేవచేయడం చాలా గొప్పవిషయమని ప్రశంసించారు. ప్రస్తుతం ఉన్న ఆశ్రమం చాలకపోవడంతో సొంత స్థలంలో భవనం నిర్మించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో భవన నిర్మాణానికి తమ వంతు సహాయ, సహకారాలు అందజేయనున్నామన్నారు.

డీసీహెచ్ఎస్ సందర్శన



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ గౌరీశంకర్

రాజాం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్(డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ సరీ్వస్) గౌరీశంకర్ మంగళవారం సందర్శించారు. తొలుత ఆయన ఓపీల విభాగం పరిశీలించి, సిబ్బంది హాజరు శాతంపై సూపరిండెంటెంట్ను ఆరాతీశారు. అలాగే ఆస్పత్రిలో వసతులు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై రోగుల నుంచి వివరాలు సేకరించారు. కొత్త బెడ్లు, ల్యాబ్కు వచ్చిన పరికరాల గురించి, అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్యులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అప్రమత్తంగా ఉండాలని, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి బారిన ప్రజలు పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే వారికి అర్ధరాత్రి అయినా వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పారిశుద్ధ్య చర్యలు మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కె.హరిబాబు, ఎం.కోటేశ్వరరావు, కళ్యాణ బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొర్లవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న కొర్లవలస గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, బూరాడ జగన్మోహనరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నాడు-నేడు పనులను పూర్తి చేయండి

- డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పూర్తి చేయాలని డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీతో పాటు కొప్పర, యూకేగుమ్మడ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని హెచ్ఎంలకు సూచించారు. విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలని, పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం వంగర జెడ్పీ పాఠశాలలో బాలికపై లైంగిక వేధింపుల ఘటనపై ఆరాతీశారు. ఇదే విషయమై హెచ్ఎం ముద్దాడ రమణమ్మతో పాటు ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయుల విలువలను కాపాడాలని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించకూడదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు.

సకాలంలో ఎరువుల పంపిణీ



చాటాయివలసలో ఎరువులు అందుకున్న రైతులు

రేగిడి: మండలంలో అన్ని గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు అవసరమైన డీఏపీ, యూరియా ఎరువులను సకాలంలో రైతులకు పంపిణీ చేశామని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని చాటాయివలస, ఉంగరాడ, చిన్నశిర్లాం, బూరాడ గ్రామాల రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో అధిక ధరకు యూరియాను రైతులు కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న ఎరువులు, విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యుడు సత్యనారాయణ

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద నిర్మాణ దశలోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను కేంద్ర బృంద సభ్యుడు సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఇళ్లస్థలాల కొలతలు సేకరించడంతో పాటు ప్రభుత్వం అక్కడ కల్పించిన వసతులపై ఆరాతీశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, వర్క్ ఇన్స్పెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బాడంగి: రోగుల బాగోగులు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సూచించారు. స్థానిక సీహెచ్సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఆస్పత్రిలో ఏవైనా సమస్యలుంటే చెప్పాలని కన్వీనర్ కాశీవిశ్వనాథంను ఎమ్మెల్యే అడిగారు. ఈ క్రమంలో సివిల్ సర్జన్, ఎనస్తీషియా, ఈఎన్టీ వైద్యుల కొరత ఉందని తెలిపారు. డెలివరీ, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల నిమిత్తం బొబ్బిలి నుంచి వైద్యుడు రాజారమేష్ను మూడు రోజుల పాటు డిప్యుటేషన్పై ఇక్కడి పంపాలని కోరగా, ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి, ఒప్పించారు. ఆస్పత్రిలో 12 మంది సిబ్బందికి 8 మంది ఉన్నారని, మిగిలిన ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. అలాగే ఆస్పత్రికి ఓ నిచ్చెన, కంప్యూటర్లు, బీరువాలు, బెంచీలు, పల్స్ మిషన్లు, ఆపరేషన్కు వినియోగించే సామగ్రి కొనుగోలు చేసి, ఇవ్వాలన్నారు. ప్రస్తుతం అత్యవసరమైనవే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. డైట్ కాంట్రాక్టర్ పేరు రమాదేవికి మార్చడానికి అనుమతి కోరుతూ తీర్మానం చేశారు. ఇన్ పేషెంట్తో పాటు అవుట్ పేషెంట్ రోగుల బాగోగులు కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అంతకుముందు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు ఎమ్మెల్యే వెళ్లి, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పి.రామారావు, సభ్యులు ఎ.సత్యం, నారాయణ, ఎంపీడీఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు

రామభద్రపురం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు ఆదేశించారు. మండల కేంద్రంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమైన ఆయన పంచాయతీలు మంజూరు చేసిన పనులకు మాత్రమే వాటి తీర్మానాలు అవసరమని,'గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన పనులను చేపట్టేందుకు పంచాయతీల తీర్మానం అవసరం లేదని స్పష్టం చేశారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. ఇప్పటికే ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు మంజూరైన రూ.20 లక్షల నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. ఎన్నో ఏళ్లుగా కనీస సౌకర్యాలకు దూరంగా ఉన్నా గ్రామీణులకు, పట్టణవాసులకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా న్యాయం జరుగుతోందన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు పుంగనూరు కుట్ర

- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాజకీయ లబ్ధి పొందేందుకే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పుంగనూరు కుట్ర పన్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన ప్రాజెక్టుల సందర్శన పేరిట చంద్రబాబు రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు సన్నద్ధమయ్యారని ధ్వజమెత్తారు. దాడుల్లో ఎవరైనా చనిపోతే ఆ నిందను ప్రభుత్వంపై వేసి, లబ్ధి పొందాలని ఆయన చూస్తున్నారన్నారు. ఇటీవల అల్లరిమూకలను రెచ్చగొట్టి, 40 మంది పోలీసులను తీవ్రంగా గాయపరిచేలా చేసిన చంద్రబాబు రాజకీయానికి ప్రజలే చరమగీతం పాడతారన్నారు. ఓ వైపు ఆయన మరోవైపు ఆయన పుత్రుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ రాష్ట్రంలో ఒక్కో వైపు తిరిగి ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. ఎవరు కమీషన్లకు కక్కుర్తిపడి పోలవరం ప్రాజెక్టు నాశనం చేశారో.. ఎవరు పోలవరం ప్రాజెక్టు పూర్తికి తరచూ ఢిల్లీ వెళ్తున్నారో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఇకనైనా చంద్రబాబు నీచరాజకీయాలు మానుకోవాలని, అప్పుడే ప్రజలు క్షమిస్తారని హితవు పలికారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఐ.గోపాలరావు, ఎస్.వేణుగోపాలనాయుడు పాల్గొన్నారు.

150 ఎకరాలకు సాగునీరు అందేలా కాలువ ఏర్పాటు

- ఎమ్మెల్యే శంబంగి హామీ ఇచ్చిన కొన్నిరోజుల్లోనే పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం



తోటపల్లి కాలువ నుంచి పిల్లకాలువ ఏర్పాటుకు పైపులైన్ వేస్తున్న దృశ్యం

తెర్లాం: తోటపల్లి ప్రధాన కుడికాలువ నుంచి రాజయ్యపేట, నందిగాం, రామన్న అగ్రహారం గ్రామాలకు పిల్లకాలువ ఏర్పాటు చేసి, సాగునీరు అందిస్తామని జూలై 29వ తేదీన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఇచ్చిన హామీ నెరవేరింది. నందిగాంలో డీసీసీబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్బంక్ ప్రారంభోత్సవానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి నందిగాం విచ్చేసిన ఆయనను అక్కడ ఏర్పాటు చేసిన సభలో నందిగాం పీఏసీఎస్ అధ్యక్షుడు గుల్లిపల్లి మృత్యుంజయరావు తోటపల్లి ప్రధాన కుడికాలువ నుంచి పిల్లకాలువ ఏర్పాటు చేస్తే రాజయ్యపేట, నందిగాం, రామన్న అగ్రహారం గ్రామాలకు చెందిన 150 ఎకరాల భూములకు సాగునీరు అందుతుందని, ఆ పనులు మంజూరు చేయాలని కోరగా, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ ఇచ్చి 10 రోజులు కాకముందే తోటపల్లి ప్రధాన కుడికాలువ నుంచి మూడు గ్రామాలకు సాగునీరు అందేలా పిల్లకాలువను నిర్మించే పనులు చేపట్టారు. అందులో భాగంగానే పైపులైన్ వేసే పనులు కూడా గతకొన్ని రోజులుగా చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే శంబంగికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

త్వరితగతిన ఎస్డబ్ల్యూపీసీల నిర్మాణం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: గ్రామాల్లో చేపడుతున్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల(ఎస్డబ్ల్యూపీసీ) నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్డబ్ల్యూపీసీల నిర్మాణాలపై ఉపాధి హామీ పథకం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న ఎస్డబ్ల్యూపీసీల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాలు చేస్తున్న వారితో మాట్లాడి, పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని, నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లుల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం చేయవద్దన్నారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ సుశీల తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

తెర్లాం: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలో మండల స్థాయి ఉద్యోగుల క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెర్లాంలోని ఉద్యోగులంతా క్రీడాపోటీలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామన్నారు.